www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 3 డిసెంబర్ 2025

5

చిత్తూరు



ఎలక్ట్రిక్ సైకిల్స్ కొనాల్సిందే..

- అంగన్వాడీలు, ఆశాలపై అధికారుల ఒత్తిడి..

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

మహిళలకే ప్రాధాన్యత ఇస్తున్నాం.. వారిని కోటీశ్వరులను చేస్తాం, పారిశ్రామికవేత్తలుగా అభివృద్ధి చెందాలి, అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో మహిళలకే అంటూ కూటమి ప్రభుత్వం మహిళలకు ఇస్తున్న హామీలు, వరాల జల్లు కురిపించింది. ఉచిత గ్యాస్, శ్రీ శక్తి పేరిట ఉచిత బస్సు ఇలా అనేక పథకాలు అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వం తాజాగా పైలట్ ప్రాజెక్టు పేరుతో చిత్తూరు జిల్లాలో మహిళలు ఎలక్ట్రిక్ బ్యాటరీ సైకిల్ కొనుగోలు ఆదేశాలు చేయడం మహిళలకు భారంగా మారుతుంది.

పైలట్ ప్రాజెక్టు పేరుతో జిల్లాలో పర్యావరణ పరిరక్షణ అంటూ మహిళలు బ్యాటరీ సైకిల్ను కొనుగోలు చేసేలా అంగన్వాడీ, ఆశ, సంఘ మిత్రులపై ప్రభుత్వ అధికారులు ఒత్తిడి చేస్తున్నారు. ఐసిడిఎస్, ఆశ, స్వయం సహాయక సంఘాలు తాము కొనుగోలు చేయడంతో పాటు ఇతర మహిళల నుండి కూడా ఎలక్ట్రిక్ సైకిల్‌ను కొనుగోలు చేయించాలని పై అధికారులు ఒత్తిడి చేయడంతో అతి తక్కువ జీతాలతో జీవితాలు నెట్టుకొస్తున్న స్కీం వర్కర్లు ఎలక్ట్రిక్ బ్యాటరీ సైకిళ్ల కొనుగోలు చేసేందుకు ఇబ్బంది పడుతున్నారు.

అధికమవుతున్న అధికారుల ఒత్తిళ్లు

ప్రభుత్వ ఆదేశాల మేరకు పర్యావరణ పరిరక్షణ కోసం ఎలక్ట్రిక్ బ్యాటరీ సైకిల్ను తప్పనిసరిగా మహిళలు కొనుగోలు చేయించాలని



అధికారులకు ఆదేశాలు అందాయి. ఇందుకోసం చిత్తూరు జిల్లాను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. అధికారుల ఆదేశాలతో ఐసిడిఎస్, వైద్య ఆరోగ్యశాఖ, డిఆర్‌డిఏ అధికారులు కింది స్థాయి సిబ్బందిపై బ్యాటరీ సైకిల్ను ఈఎంఐ పద్ధతులు కొనుగోలు చేయాలంటూ ఒత్తిళ్లు చేస్తున్నారు. బ్యాటరీ సైకిల్ కొనుగోలు చేసేందుకు రూ.5వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుంది. ప్రతినెలా ఈఎంఐ పద్ధతిలో రూ.800లు చెల్లించాలి. ఒక సైకిల్ కొనుగోలు కోసం రూ.24వేలు వెచ్చించాల్సి ఉంటుంది. నెలకు రూ.10 నుంచి 15 వేలకు మించి జీతం రాని స్కీం వర్కర్లు బ్యాటరీ సైకిల్ కొనుగోలు కోసం రూ.24 వేలు వెచ్చించడం ఇబ్బందికరంగా మారుతోందంటున్నారు.

మరోవైపు తాము పనిచేస్తున్న రంగాల్లో మహిళలను ఒప్పించి బ్యాటరీ సైకిల్ను కొనుగోలు చేయించడం కష్టమవుతోందని చెబుతున్నారు. మీరు కొనుగోలు చేయండి 10 మంది మహిళల చేత కొనిపించండి అంటూ పై అధికారులు తమపై ఒత్తిడి చేస్తున్నారని స్కీం వర్కర్లైన అంగన్వాడీలు, ఆశలు, సంఘమిత్రలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంతోకాలంగా కనీస వేతనాలు, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పోరాడుతున్న స్కీం వర్కర్ల సమస్యలను పరిష్కరించకపోగా పర్యావరణం పేరిట ఎలక్ట్రికల్ బ్యాటరీ సైకిల్ను కొనుగోలు చేయాలంటూ ఒత్తిడి చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. గౌరవ వేతనంతో పనిచేస్తున్న తమలాంటి వారికి ప్రభుత్వం ఉచితంగా ఇవ్వాలని చేయాలని కోరుతున్నారు.



ఒత్తిడి చేయడం లేదు

ఐసిడిఎస్ పీడీ వెంకటేశ్వరి

ప్రభుత్వ ఆదేశాల మేరకు రూ.34 వేల బ్యాటరీ సైకిల్ను రూ.24 వేలకు అందించడం జరుగుతోంది. అవసరం ఉన్న వారిని మాత్రమే కొనుగోలు చేయమని ప్రభుత్వఆదేశాల మేరకు కోరుతున్నాం. బ్యాటరీ సైకిల్ కొనుగోలు చేయాలంటూ అంగన్వాడీలను ఒత్తిడి చేయట్లేదు పర్యావరణ పరిరక్షణ కోసం కొనుగోలు చేయాలని కోరుతున్నాం.

ఒత్తిడి చేయడం సరికాదు

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వాడ గంగరాజు



పర్యావరణ పరిరక్షణ పేరిట ప్రభుత్వం బ్యాటరీ సైకిల్ను కొనుగోలను ప్రోత్సహించడం మంచిదే అలా అని తక్కువ జీతాలకు పని చేసే స్కీం వర్కర్లను బ్యాటరీ సైకిల్ కొనుగోలు చేయాలంటూ ఒత్తిడి చేయడం సరికాదు. సంఘమిత్రలకు ప్రతి సంఘమిత్ర ఐదు సైకిళ్ల విక్రయించాలని టార్గెట్ పెట్టడం మంచిది కాదు. మహిళా ఉత్తరనే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పుకుంటున్న కూటమి ప్రభుత్వం మహిళలపై బ్యాటరీ సైకిల్ బారాలను విధించడం సరికాదు..

కుప్పం ప్రాంత సంజీవని పీఈఎస్

పిఇఎస్‌లో సంజీవని ఆధార్ సెంటర్ ప్రారంభం: ఎమ్మెల్సీ



ప్రజాశక్తి- గుడుపల్లి: కుప్పం ప్రాంతానికి పిఈఎస్ మెడికల్ కళాశాల, ఆసుపత్రి సంజీవినిల ఎంతోమంది ప్రాణాలు కాపాడిందని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. పిఈఎస్ ఆసుపత్రిలో సంజీవిని ఆధార్ సెంటర్, చిన్నపిల్లల మానసిక ఎదుగుదల కేంద్రాన్ని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కడ పీడీ వికాస్ మర్మత్, పిఈఎస్ చైర్మన్ ప్రొఫెసర్ జవహర్ దొరస్వామి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్సీ శ్రీకాంత్ మాట్లాడుతూ.. 23ఏళ్ల క్రితం అత్యంత మారుమూల ప్రాంతమైన కుప్పంలో సీఎం చంద్రబాబు విజ్ఞప్తి మేరకు చిత్తూరులో పెట్టాల్సిన పిఇఎస్ మెడికల్ కళాశాల, ఆసుపత్రిని కుప్పంలో ఏర్పాటు చేసిన ఘనత దివంగత డాక్టర్ ఎంఆర్.దొరస్వామి నాయుడుకి దక్కుతుందన్నారు. సంజీవిని అన్నది సీఎం చంద్రబాబు డ్రీమ్ ప్రాజెక్టు అని దాన్ని పిఈఎస్ ఆసుపత్రిలో ఏర్పాటు చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్న సంకల్పంతో టాటా నర్వ్ సెంటర్‌ను కుప్పంలో ప్రయోగాత్మకంగా చేపట్టడం జరిగిందన్నారు. దశలవారీగా రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసేందుకు సీఎం చంద్రబాబు సన్నాహాలు చేస్తున్నారని, దీనికి తోడు యూనివర్సల్ హెల్త్ స్క్రీనింగ్ ద్వారా కుప్పం నియోజకవర్గ పరిధిలోని 92వేల మందికి రక్త పరీక్షలు చేసి ఆ డేటాను సంజీవిని ద్వారా ఆయుష్మాన్ భారత్ లో భద్రపరిచి భవిష్యత్తులో ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తుతుందని తెలుసుకుని ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు మెరుగైన వైద్యం అందించేందుకు ఉపయోగపడుతుందన్నారు. సంజీవిని ప్రాజెక్టులో ఇప్పటివరకు ప్రభుత్వ ఆసుపత్రులే ఉన్నాయని అయితే ప్రైవేట్ ఆస్పత్రులు కూడా భాగస్వామ్యం కావాలని సీఎం చంద్రబాబు విజ్ఞప్తి చేస్తే మొదటగా పిఇఎస్ ఆస్పత్రి ముందుకు వచ్చిందన్నారు.

సంజీవిని సీఎం డ్రీమ్ ప్రాజెక్ట్ - కడ పీడీ

'సంజీవిని' సీఎం చంద్రబాబు నాయుడు డ్రీమ్ ప్రాజెక్టు అని దాన్ని కుప్పం నుంచి పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించినట్లు కడ పీడీ వికాస్ మర్మత్ తెలిపారు. యూనివర్సల్ హెల్త్ స్క్రీనింగ్ ద్వారా ప్రతి ఒకరికి రక్తపరీక్షలు నిర్వహించి వారి ఆరోగ్య డేటాను భద్రపరిచి మెరుగైన వైద్యం అందించడం జరుగుతుందన్నారు. టాటా నర్వ్, సంజీవిని ద్వారా వైద్యం కోసం ప్రజలు ముందుగా అపాయింట్మెంట్ తీసుకోవచ్చని ఇప్పటికే 40,000 మంది నియోజకవర్గంలో దీన్ని సద్వినియోగం చేసుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వ సంస్థలకే పరిమితమైన ఆధార్ సెంటర్‌ను మొట్టమొదటిసారిగా ప్రైవేట్ మెడికల్ ఆసుపత్రికి కేటాయించడం జరిగిందన్నారు. పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామంతో ముందుకు సాగేందుకు సీఎం చంద్రబాబు ప్రణాళిక బద్ధంగా చర్యలు చేపడుతున్నారని తెలిపారు. కుప్పం ప్రాంత అభివృద్ధిలో భాగంగా ఇప్పటికే 15 పరిశ్రమలకు సీఎం శంకుస్థాపన చేశారని అయితే పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే వ్యాపారవేత్తలు తాము పరిశ్రమలు పెట్టే ప్రాంతంలో మౌలిక వసతులతో పాటు వైద్యసేవలు గురించి ఆరా తీస్తారని పిఈఎస్ ఆస్పత్రి ఇక్కడ ఉండడం అదనపు బలమన్నారు. ఆసుపత్రి వైస్ చైర్పర్సన్ భాగ్యలక్ష్మి, పిఇఎస్ విద్యాసంస్థల సిఓడి అజయ్ కుమార్, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ సురేష్ కృష్ణమూర్తి, అసోసియేట్ మిడికల్ డైరెక్టర్ డాక్టర్ రూపా సురేష్, అసోసియేట్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ భరత్ సురేష్, ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణరావ్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రమణ్య, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్బారావు , అసిస్టెంట్ మెడికల్ సూపరింటెండెంట్లు డాక్టర్ శ్రీధర్, డాక్టర్ నాగాకిరణ్, డాక్టర్ మోహన రూప, చిన్న పిల్లల డాక్టర్ రాజేంద్రనాయుడు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం



ప్రజాశక్తి -కుప్పం: ప్రతి పేదవాడికి సొంత ఇల్లు ఉండాలన్న ఉన్నత ఆశయంతో సీఎం చంద్రబాబు ఎన్టీఆర్ హౌసింగ్ ద్వారా పేదల సొంతింటి కలలు సాకారం చేస్తున్నారని ఎమ్మెల్సీ శ్రీకాంత్ పేర్కొన్నారు. కుప్పం మండలం మల్లనూరులో ఎన్టీఆర్ హౌసింగ్‌కు సంబంధించి చంద్రన్న ఇంటి పట్టాలను ఎమ్మెల్సీ శ్రీకాంత్, ఆర్టీసీ వైస్‌చైర్మన్ మునిరత్నం, టిటిడి బోర్డు సభ్యుడు శాంతారామ్, ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రేమ్‌కుమార్ పంపిణీ చేశారు. పీఎంఏవై పథకం ద్వారా పక్కా గృహాల నిర్మాణానికి రూ. 2.5లక్షలు ఇవ్వడం జరుగుతుందని లబ్ధిదారులు సకాలంలో ఇంటి నిర్మాణాలు పూర్తిచేసుకుని గృహప్రవేశాలు చేసుకోవాలని సూచించారు. ఏపీ ఐఐసీ డైరెక్టర్ ప్రేమ్‌కుమార్, మండల అధ్యక్షుడు రాజగోపాల్, కడ మెంబర్ రామచంద్ర, మాజీ ఎంపీపీ, ఎంపీడీవో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న గణిత అష్టావధానం



ప్రజాశక్తి- పుంగనూరు: గణితంలో అష్టావధానం పుంగనూరులో మొట్ట మొదటిగా నిర్వహిస్తున్నామని బాలికల హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు రుద్రాణి తెలిపారు. లక్కోజు సంజీవరాయ శర్మ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని విబిఎస్ కళ్యాణ మండపంలో మంగళవారం గణితాష్టావదానం కార్యక్రమం నిర్వహించారు. 49వ గణిత అష్టావదానం అవధానిగా హసనాపురం అరుణ శివప్రసాద్ పృచ్ఛకులు అడిగిన ప్రశ్నలకు అనర్గళంగా సమాధానాలు చెప్పి విద్యార్థులను అబ్బురపరిచారు. పృచ్ఛకులు 8 మంది అడిగిన ప్రశ్నలకు ఎలాంటి తడబాటు లేకుండా వెంటనే సమాధానాలు ఇవ్వడం జరిగింది. పృచ్ఛకులు అడిగిన ఓ ప్రశ్న 1954 జూలై 29 ఏ వారం వస్తుందని అడగగా గురువారం అని సమాధానం చెప్పారు. ఒక్క రౌండ్‌కు 8 మంది పృచ్ఛకులు ఒక్కసారి ప్రశ్నలు వేయగా అన్నింటికీ సమాధానం అనర్గళంగా చెప్పారు. అలాగా మూడు రౌండ్లు గణితాష్టావదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. లక్కోజి సంజీవరాయజ్ శర్మ ఒక అంద భారతీయ గణిత శాస్త్రజ్ఞుడని అతను కడప జిల్లా కల్లూరు గ్రామంలో జన్మించారని తెలిపారు. గణిత అవధానిగా ప్రసిద్ధి చెందారని చెప్పారు. క్యాలెండర్ను రూపొందించిన వ్యక్తి అందుడైనప్పటికీ గణితంలో అద్భుతమైన ప్రతిభను కనబరిచారని చెప్పారు. పృచ్ఛకులుగా నారాయణ, ముని లక్ష్మి, మల్లుపల్లి గాయత్రి, ప్రభాకర్, రాజేంద్ర, గణిత ఉపాధ్యాయురాలు వ్యవహరించారు. కార్యక్రమంలో జీవీ.రమణ, విశ్రాంత ఉపాధ్యాయులు వెంకటపతి, రామలింగప్ప, గణిత ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

శివయ్యా.. మామిడి రైతుల మొర ఆలకించయ్యా..!

ప్రజాశక్తి- పూతలపట్టు: మండల రైతు సంఘం నాయకులు చంగల్ రాయరెడ్డి అధ్యక్షతన స్థానిక భీమేశ్వరాలయంలో మంగళవారం మామిడి రైతుల సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సి.మునీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ చెప్పిన ప్రకారం గుజ్జు పరిశ్రమలు మామిడి రైతులకు రూ.8లు ఇవ్వాల్సిందేనని అన్నారు. ఇప్పటివరకు గుజ్జు పరిశ్రమలు మామిడి రైతులకు బిల్లులు ఇవ్వకుండా ఆలస్యం చేస్తున్నారని, కొన్ని పరిశ్రమలు అయితే తక్కువ ధర ఇవ్వడానికి ప్రయత్నాలు కొనసాగిస్తోందని ఆరోపించారు. గుజ్జు పరిశ్రమలపై ప్రభుత్వం పర్యవేక్షణ లేకపోవడం దుర్మార్గమని ఆయన మండిపడ్డారు. మామిడికి ఎనిమిది రూపాయల గిట్టుబాటు ధర సాధన కోసం పాడైపోయిన మార్కెటింగ్ వ్యవస్థను గాడిలో పెట్టాలని, నేడు డిమాండ్లతో ఈ నెల ఆఖరున చిత్తూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం ముట్టడి చేయడం జరుగుతుందని తెలిపారు. వర్కింగ్ ప్రెసిడెంట్ కే.సురేంద్రన్. ఉపాధ్యక్షులు పి. హేమలత, మునిరత్నంనాయుడు, మోహన్ రెడ్డి, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.



తుపాను వల్ల నష్టపోయిన ఏపీని ఆదుకోండి..



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: మొంథా తుపాను కారణంగా తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఆదుకోవాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు నేతృత్వంలో రాష్ట్ర హోం మంత్రి అనిత, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, కూటమి ఎంపీల బృందంతో కలిసి విజ్ఞప్తి చేసినట్లు చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు వెల్లడించారు. మొంథా తుపాను ప్రభావం వల్ల రాష్ట్రంలో సంభవించిన నష్టపోన్ని కేంద్రానికి వివరించేందుకు ఢిల్లీకి విచ్చేసిన రాష్ట్ర మంత్రి నారా లోకేష్ బాబు, హోంశాఖ మంత్రి అనితలకు దేశ రాజధాని న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సాదర స్వాగతం పలికారు. కూటమి ఎంపీల బృందం మొంథా తుపాను కారణంగా జరిగిన నష్టం అంచనా సమగ్ర నివేదికను, మంగళవారం ఉదయం న్యూఢిల్లీలో కేంద్ర అమిత్ షాను కలిసి అందజేసినట్లు ఎంపి వెల్లడించారు. ఏపీకి అండగా నిలవాలని కేంద్ర హోంశాఖ మంత్రిని తాము కోరామని, ఇందుకు కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. మొంథా తుపాను కారణంగా రాష్ట్రంలో అన్ని రంగాలకు కలిపి రూ.6,352కోట్ల మేర నష్టం వాటిల్లిందని, మొంథా తుపాను ఉగ్రరూపానికి సుమారు 3,109 గ్రామాలు తీవ్రంగా నష్టపోయిన విషయాన్ని అమిత్ షాకు సమగ్రంగా వివరించినట్లు తెలిపారు.

ప్రతి పంచాయతీకి ఎలక్ట్రిక్ ఆటోలు



శాంతిపురంలో..

ప్రజాశక్తి -కుప్పం: స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా కుప్పం నియోజకవర్గ పరిధిలోని ప్రతి పంచాయతీకి ఎలక్ట్రిక్ ఆటోలను మంజూరు చేయడం జరుగుతుందని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం పేర్కొన్నారు. కుప్పం రూరల్ మండలానికి సంబంధించి 19 ఎలక్ట్రిక్ ఆటోలను పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు. ప్రతి ఇంటికి వెళ్లి చెత్త సేకరణ లక్ష్యంగా ఎలక్ట్రిక్ ఆటోలను పంచాయతీలకు అప్పగించడం జరుగుతుందని, ప్రతి ఒక్కరూ చెత్తను ఎలక్ట్రిక్ ఆటోల్లోని వేసి స్వచ్ఛ పంచాయతీలుగా తీర్చిదిద్దేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు కలిసికట్టుగా కృషిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యుడు శాంతారామ్ ఏపీ ఐఐసీ డైరెక్టర్ ప్రేమ్ కుమార్, మండల అధ్యక్షుడు రాజగోపాల్, కడ మెంబర్ రామచంద్ర, మాజీఎంపీపీ, ఎంపీడీవో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

శాంతిపురం: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలకు కోటి రూపాయల విలువైన 500/300 కేజీల సామర్థ్యం కలిగిన ఎలక్ట్రికల్ ఆటోలను ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కడ ప్రాజెక్టు డైరెక్టరు వికాస్ ముర్మత్ పంపిణీ చేశారు. ఇకపై గ్రామ పంచాయతీలలో వున్నటువంటి ఎలక్ట్రికల్ ఆటోల ద్వారా ప్రతి రోజు క్లస్టర్ రిసోర్స్ పర్సన్ సహాయంతో ఇంటింటి చెత్తను సేకరించి, సేకరించిన చెత్తను మండలంలోని ప్లాంటుకు తరలించి, ఆ వ్యర్థాలను 7 రకాలుగా వేరుచేసి, వాటిని మార్కెంటిగ్ చేస్తామన్నారు. సేంద్రియ ఎరువులను తయారు చేసి రైతులకు సరఫరా చేసి ప్రతి గ్రామ పంచాయతీలలో 1 ఎకరా నుండి 5 ఎకరాల వరకు ఉద్యానవన పంటలకు ఈ సేంద్రియ ఎరువుల ద్వార పంటలను ప్రయోగ్మాతకంగా చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యులు శాంతారామ్, విశ్వనాథ నాయుడు, ఉదయ్ కుమార్, గోపాల్, విజయరామిరెడ్డి, పాల్గొన్నారు.

శ్మశానానికి స్థలం కేటాయించండయ్యా..

మోకాళ్ళపై నిలబడి వేడుకలు

ఎస్సీ, ఎస్టీ మౌంటరింగ్ కమిటీ సమావేశంలో అభ్యర్థన

ప్రజాశక్తి-పుంగనూరు

దళితులకు ఎన్నో ఏళ్లుగా శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని వేడుకుంటున్నా ప్రభుత్వ జీవోలు ఎన్ని ఉన్నా తమకు శ్మశాన స్థలం కేటాయించడంలో అందరూ విఫలమయ్యారని, ఇకనైనా అధికారులు స్పందించి స్థలం కేటాయించాలంటూ ఎస్సీ, ఎస్టీ మొనిటరింగ్ కమిటీ సమావేశంలో సభ్యులు రాజా మోకాలు మీద నిలబడి అభ్యర్థించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ ఇటీవల నక్కబండలో ఒకరు మరణించగా దహనం చేయడానికి సరైన స్థలం లేక తీవ్ర ఇబ్బందులు పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని అనేక గ్రామాల్లో వంకలు, చెరువుల సమీపంలోని శ్మశానాలను కేటాయించడం వలన దళితులు నిత్యం అవస్థలు పడుతున్నారని మండిపడ్డారు. ఇలాంటి పరిస్థితుల్లో దళితుల గౌరవం దెబ్బతింటోందని, ప్రతి గ్రామంలో సురక్షితమైన ప్రదేశాలలో శ్మశాన



మోకాళ్లపై నిలబడి శ్మశానానికి స్థలం కేటాయించాలని కోరుతున్న సభ్యులు

వాటికలు అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్సీ, ఎస్టీలకు కనీస సౌకర్యాలు కల్పించి, వారికి తగిన ఇంటి స్థలాలను కేటాయించి, కావాల్సిన సౌకర్యాలపై ప్రభుత్వ అధికారులు స్పందించి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంవిఐ సుప్రియ, ఎస్ఐ కెవి.రమణ, మున్సిపల్ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది సభ్యులు ఎన్ఆర్.అశోక్, చిన్నరాయులు, నరసింహులు, రామయ్య, రమణ, ఎం.శంకరప్ప, రామకృష్ణ, కృష్ణప్ప, శ్రీనివాసులు, శ్రీదేవి పాల్గొన్నారు.

జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో

నేడు 313 క్లస్టర్ల వర్క్ షాప్

ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి): ఈనెల 3వ తేదీన జిల్లా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే 313 క్లస్టర్లు వర్క్‌షాప్ రైతన్నా మీకోసం కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది ప్రతి ఒక్కరు పాల్గొనాలని వ్యవసాయ శాఖ జెడి మురళీకృష్ణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 8 గంటల నుండి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 313 క్లస్టర్లు వర్క్ షాప్ నిర్వహించడం జరుగుతుందని, ఇందులో భాగంగా ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో రబీ పంట 2025-26, ఖరీఫ్-2026, రబీ 2026-27 యాక్షన్ ప్లాన్ వివిధ అంశాలపై రైతులకు సలహాలు సూచనలు ఇవ్వనున్నట్లు తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి -కుప్పం: నియోజకవర్గంలో 86 మందికి రూ.68.60లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, పికేఎం ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ పంపిణీ చేశారు. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో మెరుగైన వైద్యం చేయించు కునేందుకు ఆర్థిక సాయం చేయాలంటూ సిఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్న వారికి సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేసినట్లు ఎమ్మెల్సీ తెలిపారు. కడ కమిటీ సభ్యులు రాజకుమార్, మున్సిపల్ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, మాజీ ఎంపీపీ సాంబశివం, సింగల్ విండో చైర్మన్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

7న ఆశ వర్కర్స్ మహాసభ

జయప్రదం చేయాలని సిఐటియు పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గంగరాజు

ప్రజాశక్తి- యాదమరి: చిత్తూరు జిల్లా ఆశ వర్కర్స్ యూనియన్ (సిఐటియు)5వ జిల్లా మహాసభలు ఆదివారం కాణిపాకంలో జరుగుతుందని, జిల్లాలోని ఆశాలందరూ పాల్గొని జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి గంగా, యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజులు పిలుపునిచ్చారు. మంగళవారం ఆశా డే సందర్భంగా మాదిరెడ్డిపల్లి, యాదమరి, పెనుమూరు, ఐరాల, పూతలపట్టు, కాణిపాకం తదితర పిహెచ్‌సి ఆశల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఆశాలకు కనీస వేతనాలు ఇవ్వాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, అదనపు పనులు తగ్గించాలని, పించన్ల డ్యూటీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభలకు ముఖ్యఅతిథిగా ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి హాజరవుతున్నారని తెలిపారు. ప్రజలకు క్షేత్రస్థాయిలో అన్ని రకాల సేవలు అందిస్తున్నప్పటికీ వారిని నిర్లక్ష్యం చేయడం దారుణమన్నారు. కొన్నిచోట్ల ఆశా వర్కర్‌కి రకరకాల పనులు చేయిస్తూ ఇబ్బందులు పెడుతున్నారని వాటిని మానుకోవాలని డిమాండ్ చేశారు. ఆశా డే సందర్భంగా ఇంకా కొన్నిచోట్ల కిందనే కూర్చోబెడుతున్నారని ఇది సరైన పద్ధతి కాదన్నారు. 7న జరిగే మహాసభలకు జిల్లాలోని ఆశలందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఘనంగా ఫిజియోథెరపీ గ్రాడ్యుయేషన్ డే



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (ఎఐఎంఎస్ఆర్) పరిధిలోని కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మంగళవారం 2020 బ్యాచ్ గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. విద్యా ప్రమాణాల్లో నూతనోత్సాహాన్ని నెలకొల్పుతూ వరుసగా వంద శాతం ఫలితాలు సాధిస్తూ, మెరుగైన ప్లేస్‌మెంట్‌లు అందిస్తూ ప్రత్యేక గుర్తింపు సంపాదించిన ఈ కళాశాల నుంచి మరో బ్యాచ్ విజయవంతంగా పట్టాలు అందుకోవడంతో మొత్తం క్యాంపస్ ఆనందోత్సాహాలతో పండుగ వాతావరణం నెలకొంది. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వైస్ ఛాన్సలర్ డాక్టర్ హెచ్.వినోద్ భట్ మాట్లాడుతూ ఫిజియోథెరపీ పుట్టుక నుంచి జీవనాంతం వరకు ప్రతి దశలో కీలక పాత్ర పోషించే గొప్ప వైద్యరంగం అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఫిజియోథెరపిస్టులకు అవకాశాలు విస్తృతంగా పెరుగుతున్నాయి. డిగ్రీతో ఆగిపోకుండా స్పెషలైజేషన్లలో ముందుకు సాగుతూ తల్లిదండ్రులు, సంస్థ పేరు, గౌరవం నిలబెట్టాలని అన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వి.కిరణ్ మాట్లాడుతూ ఫిజియోథెరపీ మనిషి జీవితంలోని ప్రతిదశకు అవసరమైన వైద్యసేవ అన్నారు. విద్యార్థులు తమ జ్ఞానం, నైపుణ్యాన్ని సేవాభావంతో సమాజానికి అందించాలని కోరారు. ఈఏడాది విద్యార్థులంతా తమ ఇంటర్న్‌షిప్‌లను విజయవంతంగా పూర్తి చేసి గ్రాడ్యుయేషన్‌కు అర్హులయ్యారని, ఇప్పటి వరకు మూడు బ్యాచ్‌లు వరుసగా వంద శాతం ఫలితాలు సాధించడం ఈ కళాశాల ప్రతిష్టను మరింత ఉన్నత స్థాయికి చేర్చిందని పేర్కొన్నారు.

రోడ్డుపై ఆక్రమణలు తొలగింపు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో జరుగుతున్న రోడ్డు అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్ర తెలిపారు. నగరపాలక కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ ఆదేశాల మేరకు పురపాలక శాఖ రోడ్డు పనులను వేగవంతం చేసింది. దర్గా సర్కిల్ నుంచి ఇరువారం వరకు రోడ్డు విస్తరణలో భాగంగా మంగళవారం పలమనేరు రోడ్డుపై ఉన్న ఆక్రమణలను తొలగించే కార్యక్రమాన్ని అధికారులు చేపట్టారు. నాగేంద్ర ఆధ్వర్యంలో జెసిబి సహాయంతో అనధికార నిర్మాణాలను తొలగించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రణాళిక విభాగ సిబ్బంది పాల్గొన్నారు. రోడ్డు విస్తరణ పనులను ఎటువంటి అంతరాయం లేకుండా పూర్తి చేయడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

రైతు సంక్షేమమే లక్ష్యం

రాష్ట్ర మొదలియార్ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ మణి

ప్రజాశక్తి-కుప్పం: రైతు సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంచి ప్రభుత్వానికి రైతులు అండగా ఉండే ఆశీర్వదించాలని రాష్ట్ర మొదలియార్ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ మణి పేర్కొన్నారు. కుప్పం మండలం చెక్కునత్తం రైతు సేవా కేంద్రంలో రైతన్నా మీకోసం, అన్నదాత సుఖీభవ కార్యక్రమం నిర్వహించారు. రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. రైతులు పురుగులు ముందు లేని వ్యవసాయంపై దృష్టి సారించాలని దీని ద్వారా అధిక దిగుబడులతో పాటు మంచి లాభాలు వస్తాయని సూచించారు. మాజీ ఎంపీపీ సాంబశివం, కడ సభ్యుడు రామచంద్ర కార్పొరేషన్ డైరెక్టర్ శరవణ, యువత అధ్యక్షులు కనకరాజు, బీరప్ప, బాలు, ఏవో ఫయాజ్, వ్యవసాయ అధికారి పల్లవి, విఆర్ఓ మహేష్ పాల్గొన్నారు.

బోధన, నైపుణ్యాల శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: అపోలో ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (ఎఐఎంఎస్ఆర్), మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్ (ఎంఈయూ) ఆధ్వర్యంలో మూడు రోజుల బేసిక్ కోర్స్ ఇన్ మెడికల్ ఎడ్యుకేషన్ (బిసిఎంఈ) కార్యక్రమం మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. ఈకార్యక్రమాన్ని ప్రారంభించిన ఎఐఎంఎస్ఆర్ డీన్ డాక్టర్ అల్ఫ్రెడ్ జె. అగస్టిన్ మాట్లాడుతూ తమ సంస్థలో ఇది వరుసగా 5వ బిసిఎంఈ కార్యక్రమమని తెలిపారు. నాణ్యమైన వైద్యవిద్యకు సమర్థవంతమైన బోధనా నైపుణ్యాలు అత్యంత కీలకమని, ప్రస్తుత మెడికల్ కరికులం ఇంప్లిమెంటేషన్, బోధనా విధానాల మెరుగుదల, విద్యార్థులలో కాన్సెప్ట్ క్లారిటీ పెంపు ఇవన్నీ బిసిఎంఈ ద్వారా బలోపేతం అవుతాయని అన్నారు. ప్రతి మెడికల్ టీచర్ తప్పనిసరిగా ఈ ప్రోగ్రామ్‌ను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. నోడల్ సెంటర్ వేలూరు సిఎంసి నుండి అబ్జర్వర్‌గా విచ్చేసిన ప్రొఫెసర్ డాక్టర్ రమ్య మాట్లాడుతూ ప్రస్తుత బోధన విధానాల్లో ఎన్నో మార్పులు చోటుచేసుకుంటున్నాయని, ప్రతి టీచర్‌కు బోధనా శైలిలో తేడాలున్నా, విద్యార్థుల అర్థం చేసుకునే సామర్థ్యాన్ని పెంపొందించడంలో బిసిఎంఈఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. అకడమిక్ రీసర్చ్, కెరీర్ అభివృద్ధి కోసం ఈ కోర్సు అమూల్యమైనదని పేర్కొన్నారు.

నేడు కార్తీక దీపోత్సవం

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: మండలంలోని మొగిలి గ్రామంలో మొగిలిశ్వరస్వామికి ఆలయానికి అనుసంధానమైన దేవరకొండలో బుధవారం కార్తీక్ దీపోత్సవ కార్యక్రమం జరుగుతుందని ఆలయ వంశపార ధర్మకర్త విజయ్ కుమార్ తెలిపారు. బుధవారం ఉదయం నుండి ప్రత్యేక పూజలు చేపట్టి సాయంత్రం కార్తీకదీపం ఆరాధన చేయనున్నట్లు తెలిపారు.

సప్త కనికలమ్మ దేవాలయంలో

చిత్తూరు అర్బన్: దొడ్డిపల్లిలోని సప్త కనికలమ్మ దేవాలయంలో కార్తీ దీపోత్సవం నిర్వహించనున్నట్లు కార్యనిర్వహణ అధికారి వెంకటరాయులు, ఆలయ కమిటీ సభ్యులు నలిని తిరుకుమరన్, ఎస్.తిరుకుమార్ తెలిపారు. మంగళవారం దొడ్డిపల్లిలోని స్త్రీ సప్త కనికలమ్మ దేవాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుధవారం ఆలయంలో లక్ష దీపోత్సవం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, మొదలియా కార్పొరేషన్ చైర్మన్ సీఎస్ త్యాగరాజన్, డైరెక్టర్ గోపాలకృష్ణన్ పాల్గొంటారని తెలిపారు. కమిటీ సభ్యులు చంద్రశేఖర్, దేవరాజులు, విజయ్ కుమార్, కుమార్, పద్మిని, దామోదరం, శివకుమరన్, నాగలింగం, పాండియన్, ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

వారానికో గ్రామంలో విద్యుత్ పనులు: ఏఈ



ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: వారానికి ఒక రోజు ఎంపిక చేసిన గ్రామంలో విద్యుత్ అంతరాయం లేకుండా పనులు చేస్తామని ఆవలకొండ విద్యుత్ శాఖ ఏఈ తనిగవేలు తెలిపారు. జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ ఆదేశాల మేరకు ప్రతి మంగళవారం విద్యుత్ సిబ్బంది మార్నింగ్ వాకింగ్ కార్యక్రమంలో భాగంగా తూగుండ్రం, తూగుండ్రం దళిత వాడలో లూజ్ లైన్‌లు బాగుచేయడం, ఇంటిలోపల ఉండే మీటర్లను బయట గోడకు ఏర్పాటు చేయడం, లైన్‌లపై చెట్ల కొమ్మలు తగులుతుంటే తొలగించడం వంటి పనులు చేస్తామని ఏఈ పేర్కొన్నారు. ఎల్ఐ గజేంద్ర, లైన్‌మ్యన్ సుబ్రహ్మణ్యం, టిడిపి జిల్లా క్రిస్టియన్ సెల్ కార్యదర్శి శాంత కుమార్, టిఎన్‌టియుసి జిల్లా అధికార ప్రతినిధి జీవరత్నం, గ్రామకమిటీ అధ్యక్షుడు నీరజక్షల రెడ్డి, మండల బీసీ సెల్ ఉపాధ్యక్షుడు రాఘవేంద్ర పాల్గొన్నారు.

గణిత ప్రజ్ఞశాలి సంజీవరాయ శర్మ




ప్రజాశక్తి- యాదమరి: గణిత అపార ప్రజ్ఞశాలి లక్కోజు సంజీవరాయ శర్మ వర్ధంతిని మంగళవారం కసిరాల ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఆయను ప్రతి విద్యార్థి స్మరించుకోవాలని సీనియర్ గణితోపాధ్యాయులు కె.కనకాచారి తెలిపారు. ఆయన శ్రీ కాళహస్తిలో పిడేలు విద్వాంసులుగా పేరు పొందారని, వర్గాల, ఘనాల ఫలితాలు, హ్యూమన్ కంప్యూటర్ శకంతదేవి కంటే ఒక సెకన్ ముందుగానే బదులు ఇచ్చేవారని తెలిపారు. కార్యక్రమంలో గొప్ప మేధావి అని ఉపాధ్యాయులు కనకాచారి, భాస్కర్‌రెడ్డి, రంగనాథం పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ట్రైనింగ్ ఎస్సై జయశ్రీ

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి



ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు చెరువులు, వాగులు పూర్తిగా నిండి ప్రమాదకరంగా ప్రవహిస్తున్నాయని ఈ నేపథ్యంలో మండల ప్రజల అప్రమత్తంగా ఉండాలని ట్రైనింగ్ ఎస్సై జయశ్రీ సూచించారు. పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, గ్రామాల మధ్య ప్రయాణించే ప్రజలు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఇటీవల మండల కేంద్రంలో ఓ మహిళ కరెంట్ షాక్‌కు గురైన ఘటనను ప్రస్తావిస్తూ వర్షాల సమయంలో కరెంట్ పాసయ్యే అవకాశం ఎక్కువగా ఉండటం వల్ల విద్యుత్ స్తంభాలున్న చోట్ల, తడిసిన మీటర్ల దగ్గర ఎవరూ తాకరాదని తెలిపారు. పిల్లలను చెరువులు, వాగుల వద్దకు పంపవద్దని తల్లిదండ్రులను కోరారు. అలాగే వాగులు, వంకలు దాటే సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు.

పింఛన్ కోసం పడిగాపులు



పింఛన్ కోసం సచివాలయం ఎదుట ఎదురుచూస్తున్న వృద్ధులు

ప్రజాశక్తి- పలమనేరు రూరల్ (గంగవరం): పలమనేరు రూరల్ మండలంలోని మండిపేట, కోటూరు పంచాయతీ బయప్పగారిపల్లి గ్రామంలో రెండో రోజు 11 గంటలైన పింఛన్ ఇవ్వకపోవడంతో వృద్ధులు, వికలాంగులు సచివాలయం వద్దకు వెళ్లి ఎదురు చూశారు. సచివాలయంలో అధికారులు ఎవరూ రాకపోవడంతో వర్షంలోనే అధికారుల కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రతినెలా ఒకటో తేదీ తెల్లవారాగానే ఇంటి వద్దకు వెళ్లి పెన్షన్లు అందజేస్తారని, అయితే ఇక్కడ అధికారులు నిర్లక్ష్యంతో రెండోరోజు కూడా పింఛన్ ఇవ్వకపోవడంతో పింఛనుదారులు నగదు కోసం పడిగాపులు పడాల్సిన వస్తోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ అందించాలని ఆదేశించినా అధికారులు స్పందించకపోవడం బాధాకరమైన అంటున్నారు.

విద్యార్థులకు దుస్తులు వితరణ



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: సమాజంలో అణగారిన వర్గాల విద్యార్థినుల విద్య, ఆరోగ్యం, స్వాభిమానం బలపడే దిశగా పలు సేవా కార్యక్రమాలు ముందుకు వస్తున్న నేపథ్యంలో చిత్తూరు జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలకు (కేజీబీవీలు) జైన్ సంఘం చేసిన సేవా కార్యక్రమం ప్రత్యేకంగా నిలిచింది. జిల్లాలోని ఎనిమిది కేజీబీవీలకు మొత్తం 312 జతల దుస్తులను జైన్ సంఘం అధ్యక్షులు సుభాష్ జైన్ అందించారు. ఈ దుస్తులను మంగళవారం చిత్తూరు సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ మద్దిపట్ల వెంకటరమణ విద్యార్థినులకు అందించేందుకు సంబంధిత పాఠశాల ఉపాధ్యాయులకు పంపిణీ చేశారు. జైన్ సంఘం అధ్యక్షులు సుభాష్ జైన్ చేస్తున్న సేవలను పీడీ వెంకటరమణ ప్రశంసించారు.

పెద్ద ఉప్పరపల్లెలో ఆశాడే..

ప్రజాశక్తి- సోమల: సోమల మండలం పెద్ద ఉప్పరపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశాడేను వైద్యాధికారి బాలాజీ ఆధ్వర్యంలో నిర్వహించారు. తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని ప్రతి తల్లి బిడ్డ పుట్టంగానే ముర్రపాలు బిడ్డకు తాగించడం వల్ల రోగ నిరోధక శక్తి చిన్నారులలో పెరిగి ఆరోగ్యంగా ఉంటారని ఇదే విషయాన్ని గ్రామాలలో ఆశా కార్యకర్తలు గర్భవతులకు తప్పక తెలియజేయాలన్నారు. మదర్ అండ్ చైల్డ్ వివరాలు నమోదు తప్పక చేయాలని, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండే విధంగా ప్రజలను చైతన్యవంతులను చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉదయ భాస్కర్, అలివేలు, ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత రక్త పరీక్షలు



ప్రజాశక్తి- శాంతిపురం: మండలంలోని సెట్టేపల్లి గ్రామంలో జెడ్‌పిహెచ్ఎస్ హై స్కూల్‌లో పిల్లలకు కుప్పం కేసి హాస్పిటల్ ఎండి డాక్టర్ మంజునాథ్ ఆధ్వర్యంలో ఉచిత రక్తపరీక్ష నిర్వహించి వారి బ్లడ్ గ్రూప్ నిర్ధారణ చేసి, నిర్ధారణ పత్రం అందచేశారు. అలాగే రక్తదానం విలువ, ఆరోగ్యం ఎలా ఉంచుకోవాలో పిల్లలకు అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. డాక్టర్ బిందు వరప్రసాద్, డాక్టర్ మంజునాథ్ విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు.

సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన



ప్రజాశక్తి- సోమల: సోమల ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు గత మూడు రోజులుగా ఎస్.నడింపల్లి గ్రామంలో ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని నిర్వహిస్తూ గ్రామంలో పారిశుద్ధ్యం ప్రజలకు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కలిగించడం తదితర సేవా కార్యక్రమాలను చేస్తున్నారు. మంగళవారం శిబిరానికి చెందిన 30 మంది విద్యార్థులు ఇంటింటికి తిరుగుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా చలి తీవ్రత ఎక్కువగా ఉన్న కారణంగా కాచి చల్లార్చిన నీటిని తాగాలని, దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ అమరేంద్ర కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ గౌతమ్ పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్త మృతికి నివాళి



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరపాలక పరిధిలో చిన్నమ్మగుడికి చెందిన టిడిపి కార్యకర్త వినోద్ మృతి పట్ల ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ విచారం వ్యక్తం చేశారు. మంగళవారం ఎమ్మెల్యే తండ్రి, జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ డైరెక్టర్ గురజాల చెన్నకేశవుల నాయుడు వినోద్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే తరపున రూ.30వేలు ఆర్థిక సాయం అందించారు. పార్టీ తరపున అన్నివిధాలుగా ఆదుకుంటామని, అండగా ఉంటామని ధైర్యం చెప్పారు.

ఇదే చివరి అవకాశం..!

అక్రమ లేఔట్లను క్రమబద్ధీకరించుకోండి
పికేఎం ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్



ప్రజాశక్తి -కుప్పం: ఎలాంటి అనుమతులు లేకుండా వేసిన అక్రమ లే అవుట్‌లతోపాటు సైట్లను క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందని రియల్ ఎస్టేట్ వ్యాపారులు, బిల్డర్లు, గృహ నిర్మాణాలు చేపట్టిన వారు క్రమబద్ధీకరించుకోవాలని పికేయం ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు, కుప్పం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. బిపిఎస్, ఎల్ఆర్ ఎస్ పథకాలకు సంబంధించి కుప్పం మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వం హైకోర్టులో పోరాడి మరో అవకాశాన్ని కల్పించిందని ఇదే చివరి అవకాశంగా భావించి అక్రమ లేఔట్లను తక్కువ ఫీజుతో క్రమబద్ధీకరించుకోవాలని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో అక్రమ లే అవుట్ల క్రమబద్ధీకరణకు ఎంతగా ప్రయత్నించిన సాధ్యం కాలేదని అయితే సీఎం చంద్రబాబు ప్రత్యేక చొరవతో ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందని దీన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇప్పటికే కుప్పం, పలమనేరు, పుంగనూరు, మదనపల్లి పరిధిలో అక్రమ లేఅవుట్లు ప్లాట్లను టౌన్ ప్లానింగ్ అధికారులు, మున్సిపల్ అధికారులు గుర్తించడం జరిగిందన్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టిన వారు నిర్లక్ష్యంగా ఉంటే భవిష్యత్తులో ఇబ్బందులు పడతారని ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, మాజీఏ ఎంసి చైర్మన్ సత్యేంద్రశేఖర్, కౌన్సిలర్లు జిమ్ దాము, జాకీర్, సోమశేఖర్, ఎం ఆర్ సురేష్, సురేష్, గణపతి, క్లస్టర్ ఇంచార్జ్ కన్నన్, విస్తరణ కమిటీ సభ్యుడు మంజునాథ్, యువనేత హర్ష ధర్మతేజ్ పాల్గొన్నారు.

సచివాలయాన్ని తనిఖీ చేసిన కమిషనర్



ప్రజాశక్తి- పలమనేరు: పట్టణ మున్సిపల్ పరిధిలోని రంగాపురం, గంటావూరు, పాతపేట, ఓల్డ్ పేట-1 సచివాలయాలను మంగళవారం మున్సిపల్ కమిషనర్ ఎన్‌వి రమణారెడ్డి తనిఖీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న సర్వేల పురోగతిపై సచివాలయాల కార్యదర్శులతో సమీక్షించారు. సర్వేలను నిర్దేశించిన కాలపరిమితి లోపల పూర్తి చేయాలని ఆదేశించారు. కమీషనర్ మాట్లాడుతూ ప్రతి సచివాలయ కార్యదర్శి పనివేళలను ఖచ్చితంగా పాటించాలని రికార్డులను ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని, ప్రజలకు మరింత మెరుగైన సేవలను అందించాలని సూచించారు. మున్సిపల్ మేనేజర్ ఖాదర్ మోహిద్దీన్ , పురపాలక సంఘ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా ఆమోదం ఉన్న వారికే పదవులు

మాజీ ఎంపీ జయకుమార్



ప్రజాశక్తి- ఎస్ఆర్ పురం: మండల కేంద్రంలో జాతీయ కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణ కార్యక్రమాన్ని జీడీ నెల్లూరు ఇంచార్జ్ రమేష్ బాబు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఏఐసీసీ ఎన్నికల పరిశీలకులుగా డాక్టర్ జయకుమార్ హాజరయ్యారు. జిల్లా నుండి రాష్ట్రస్థాయి వరకు అధ్యక్షుల మార్పు చేయాలన్న అధిష్టానం ఆదేశాలతో చిత్తూరు జిల్లా అధ్యక్షుల పరిశీలనకు బాధ్యత తీసుకున్నట్లు తెలిపారు. ప్రజాఆమోదం ఉన్నవారికే అధ్యక్ష పదవిని తాను అప్పగిస్తామన్నారు. ఈవాతావరణాన్ని కాంగ్రెస్ పార్టీలోనే చూడగలమన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తాను కాంగ్రెస్ పార్టీలో ఎంపీగా రెండు పర్యాయాలు అనూహ్యమైన ఓట్ల మెజార్టీ సాధించి ఎంపిగా ప్రజలకు సేవలు అందించాని అన్నారు. చిత్తూరు జిల్లాలోని జీడీ నెల్లూరు నియోజకవర్గంలో ఇంచార్జ్ రమేష్ బాబు అట్టహాసంగా సంస్థాగత నిర్మాణ కార్యక్రమాన్ని నిర్వహించినందుకు ఆయనను ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర పరిశీలకులు డాక్టర్ దామోదరం, రాం భూపాల్ రెడ్డి, డీసీసీ కో ఆర్డినేటర్ పోటుగారి భాస్కర్, చిత్తూరు నగర అధ్యక్షులు టిక్కీ రాయల్, మాజీ జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు గౌతం పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఓబిసి కోఆర్డినేటర్‌గా మురళీమోహన్ యాదవ్



ప్రజాశక్తి- పుంగనూరు: కాంగ్రెస్ పార్టీ ఓబిసి జాతీయ జాయింట్ కో ఆర్డినేటర్‌గా పుంగనూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ డాక్టర్ జి.మురళీమోహన్ యాదవ్‌ను నియమించినట్లు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎస్.అయుబ్ బాష మంగళవారం తెలిపారు. జాతీయస్థాయిలో మురళీమోహన్ యాదవ్‌కు ఈ పదవి రావడం చాలా సంతోషించదగ్గ విషయమన్నారు. పట్టణ కాంగ్రెస్ పార్టీ తరపున హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తెచ్చేందుకు అందరం కలిసికట్టుగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ముబారక్, పాషా, రాయల్ అల్తాఫ్, ఫయాజ్, అజ్మత్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక కేంద్రంగా తిరుపతి : మంత్రి అనగాని



శ్రీవారి సేవలో ఇన్‌ఛార్జి మంత్రి


ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

టెంపుల్ సిటీలకు తిరుపతి సెంట్రల్ జోన్‌గా చేసుకుని ఆధ్యాత్మిక అభివృద్ధికి సిఎం ఆదేశాలు జారీ చేశారని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ చెప్పారు. మంగళవారం తిరుమల శ్రీవారిని, తిరుపతి రూరల్ పాతకాల్వలో వెలసిన వకుళమాత అమ్మవారిని దర్శించుకున్న అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో పాజిటివ్ వాతావరణం నెలకొందని, ప్రతి నెలా నూతన ఉత్తేజంతో సరికొత్త పెట్టుబడులతో భావితరాలకు మార్గనిర్దేశం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళుతోందన్నారు. విశాఖలో సిఐఐ సమ్మిట్ ద్వారా 12 లక్షల పెట్టుబడులతో 15 లక్షల మందికి ఉపాధి కల్పించేలా ఒప్పందాలు జరిగాయన్నారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తులకు కల్పించాల్సిన ఏర్పాట్లపైన టిటిడి అధికారులతో చర్చించనున్నట్లు చెప్పారు. విశాఖ, సెంట్రల్, రాయలసీమ మూడు జోన్‌లుగా విభజించి రాష్ట్రాభివృద్ధి జరుగుతుందన్నారు. రాయలసీమ జోన్‌కు తిరుపతి కేంద్రంగా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేయాలన్న సిఎం ఆకాంక్షకు అనుగుణంగా ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. టిటిడి ఎక్స్ అఫిషియో సభ్యులు డాలర్స్ దివాకర్‌రెడ్డి వకుళమాత ఆలయ విశిష్టతను మంత్రికి వివరించారు.

తుడా చైర్మన్‌తో చెంగారెడ్డి భేటీ

తిరుపతి టౌన్ : తుడా చైర్మన్, తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్ అఫిషియో మెంబర్ డాలర్స్ దివాకర్ రెడ్డి తో నగరి మాజీ ఎమ్మెల్యే రెడ్డివారి చెంగా రెడ్డి భేటీ అయ్యారు. ముందుగా తుడా చైర్మన్ తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్ అఫిషియో మెంబర్ డాలర్స్ దివాకర్ రెడ్డిని రెడ్డివారి చెంగా రెడ్డి దుశ్శాలువాతో సత్కరించి, మరింత ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ భేటీలో నగరి నియోజకవర్గంలో చేపట్టవలసిన అధివద్ధి పనులను గురించి తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి కి వివరించారు. ఈ సందర్భంగా వర్తమాన రాజకీయాల గురించి చర్చించారు. నగరి నియోజకవర్గంలో అభివద్ధి పనులకు తుడా తరుపున సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

శ్రీవారి సేవకులు బ్రాండ్ అంబాసిడర్లు



ప్రజాశక్తి - తిరుమల


శ్రీవారి సేవకులు హిందూ ధర్మానికి బ్రాండ్ అంబాసిడర్లని టిటిడి అదనపు ఈవో సిహెచ్ వెంకయ్యచౌదరి అన్నారు. మంగళవారం తిరుమలలోని సేవాసదన్‌లో గ్రూప్ సూపర్‌వైజర్లకు తొలి బ్యాచ్ ట్రెయిన్ ద ట్రైనీస్ శిక్షణా కార్యక్రమం జరిగింది. అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి మాట్లాడుతూ శ్రీవారి సేవను మరింత బలోపేతం చేయడంలో భాగంగానే వారిలోని నైపుణ్యాలను అభివృద్ధి చేయడమే ట్రెయిన్ ద ట్రైనీస్ శిక్షణ ఉద్దేశమన్నారు. వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యాల పెంపు, కమ్యూనికేషన్, భక్తులతో నడవడిక, నాయకత్వ లక్షణాలు, టిటిడి చరిత్ర, శ్రీవారి సేవ ప్రాముఖ్యత, పురాణాల పరిజ్ఞానం తదితర అంశాలు ఉంటాయన్నారు. పండితులు డాక్టర్ మేడసాని మోహన్, డాక్టర్ దామోదర్‌నాయుడు, డాక్టర్ శ్రీనివాస్, టిటిడి చీఫ్ పిఆర్ఒ డాక్టర్ రవి, పిఆర్ఒ నీలిమ పాల్గొన్నారు.

క్రైం న్యూస్

కుటుంబ కలహాలతో..

ప్రైవేట్ టీచర్ ఆత్మహత్య


ప్రజాశక్తి - కుప్పం



గాయత్రి ఫైల్‌ఫొటో, సూసైడ్ నోట్

కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ ప్రైవేటు టీచర్ తన కొడుకుని కరాటే క్లాసుకు పంపించి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన మంగళవారం కుప్పం పట్టణంలో చోటు చేసుకుంది. కుప్పం మోడల్ కాలనీకి చెందిన గాయత్రి 13 ఏళ్ల క్రితం ఆర్టీసీలో కండక్టర్‌గా పనిచేస్తున్న యువరాజ్‌ను ప్రేమ వివాహం చేసుకుంది. వీరికి 8వ తరగతి చదువుతున్న కొడుకున్నాడు. యువరాజ్ ప్రస్తుతం కుప్పం ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తుండగా గాయత్రి పట్టణంలోని ఓ ప్రైవేటు స్కూల్లో టీచర్‌గా పనిచేస్తుంది. అయితే కుటుంబ తగాదాలకు తోడు ఆర్థిక ఇబ్బందులు నేపథ్యంలో ఇదివరకే గాయత్రి ఓసారి ఆత్మహత్యాయత్నంకు పాల్పడింది. తాను రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ తోటి టీచర్లకు వీడియో కాల్‌చేసి చెప్పడంతో వారు అప్రమత్తమైన వారు గాయత్రిని రక్షించారు. ఈ నేపథ్యంలో ఏం జరిగిందో తెలియదు గానీ మంగళవారం ఉదయం ఏడు గంటల ప్రాంతంలో కొడుకుని కరాటే క్లాసుకు పంపించి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకునే ఆత్మహత్యాయత్నంకు పాల్పడింది. కొన ఊపిరితో ఉన్న గాయత్రి నీ కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా మృతి చెందింది. 'ఐ యాం సారీ సుశాంత్.. ఐ యాం వెరీ సారీ మై డియర్ ఫ్యామిలీ మెంబర్స్' అంటూ సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్య చేసుకోవడం కన్నీళ్లు తెప్పిస్తోంది. తన కొడుకు కుటుంబ సభ్యులకు క్షమాపణ చెబుతూ గాయత్రి రాసిన సూసైడ్ లెటర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు నేపథ్యంలో కుప్పం పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహానికి కుప్పం ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. అయితే సూసైడ్ లెటర్ గాయత్రి రాయలేదని అది ఆమె హ్యాండ్ రైటింగ్ కాదంటూ మృతురాలి తల్లి, తమ్ముడు ఆరోపిస్తున్నారు.

రైలు ఢీకొని.. 13 దేవస్థానం ఆవులు మృతి



ప్రజాశక్తి- పూతలపట్టు: పూతలపట్టు మండల పరిధిలోని శ్రీ కలికిరి కొండ దేవస్థానంకు చెందిన 13 పశువులు మంగళవారం తెల్లవారుజామున మూడు గంటల ప్రాంతంలో రైలు ఢీకొన్న ప్రమాదంలో మృతి చెందాయి. కలికిరి కొండపై వందల పశువులు ఉన్నాయి. గ్రాసం కోసం నిత్యం అనేక పశువులు గ్రామాల వైపు వస్తున్నాయి. ఈతరుణంలో అమ్మేపల్లి గ్రామ సమీపంలో పట్టాలు దాటుతున్న పశువుల గుంపును తిరుపతి వైపు నుంచి చిత్తూరు వైపు వెళుతున్న రైలు ఢీకొనడంతో పశువుల మాంసపు ముద్దలు చల్లాచదురుగ పట్టాలపై పడ్డాయి. ఈ మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గత వారం రోజుల్లోనే 24 పశువులు రైలు ప్రమాదంలో మృతి చెందినట్లు ప్రజలు చెబుతున్నారు. అటు దేవస్థానం అధికారులు.. ఇటు మండల అధికారులు కానీ పశువుల సంరక్షణపై తగిన చర్యలు తీసుకోకపోవడంతోనే నిత్యం అనేక పశువులు రైలు ప్రమాదానికి గురవుతున్నట్లు తెలుస్తోంది. ఇకనైనా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

రెండు కేజీల గంజాయి స్వాధీనం

నిందితుల అరెస్టు, రిమాండ్‌కు తరలింపు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ ప్రభాకర్

ప్రజాశక్తి-పలమనేరు: రెండు కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని, ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డిఎస్పీ డేగల ప్రభాకర్ తెలిపారు. మంగళశారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంగళవారం ఉదయం పెద్ద పంజాణి మండలం, రామాపురం గ్రామం సమీపంలోని బసాపురం క్రాస్ వద్ద పెద్దపంజాణి తహశీల్దార్ హనుమంతు, పిఎస్ఐ ఏ.మారెప్ప పోలీసు సిబ్బందితో ముద్దాయిలు షేక్ మస్తాన్, శ్యామలను అరెస్టు చేసి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి నుంచి రూ.31,500లు విలువగల రెండు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి, కోర్టుకు రిమాండ్‌కి పంపినట్లు తెలిపారు.

నిర్మాణంలో ఉన్న ఇంట్లో చోరీ

ప్రజాశక్తి- పలమనేరు: పట్టణంలోని రాధాబంగ్లా ఏరియాలో పలమనేరు పాతపేట శ్రీ కనక దుర్గమ్మ గుడి అర్చకులు గోపిస్వామి నిర్మిస్తున్న ఇంట్లో కరెంటు వైర్లు చోరీకి గురయ్యాయి. గత మార్చి నెలలో ఒకసారి ఇలాగే వైర్లు చోరీ జరిగితే, అదే వీధిలో గల నిందితులు సాయి, సంజయ్, గణేశ్‌ల నుంచి పోలీసులు వైర్లను రికవరీ చేశారు. ఇప్పుడు దాదాపుగా రూ.1.20 లక్షలు విలువచేసే ఎలక్ట్రిక్ వైర్లు, సామాన్లు దుండగులు దొంగిలించారని బాధితుడు తెలిపారు. పోలీసులు కేసు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ మధ్యన రాధా బంగ్లా ఏరియాలో ఎక్కువగా చోరీ కేసులు నమోదు కావడంతో స్థానికులు భయం గుప్పెట్లో బతుకుతున్నారు. పోలీసులు ఈ ఏరియాపై ప్రత్యేక నిఘా పెట్టాలని కోరుతున్నారు.

బైక్‌ను ఢీకొన్న గుర్తు తెలీని వాహనం

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: లక్కనపల్లి- దాసర్లపల్లి జాతీయ రహదారిలోని మిట్టపల్లి గ్రామసమీపంలో మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. గుర్తుతెలియని వాహనం ద్విచక్రవాహనదారిని ఢీకొనడంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్పందించిన గ్రామస్తులు బైరెడ్డిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అనంతరం పలమనేరు ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు వైద్యులు తెలిపారు.